# చర్చ: రంగంలో వున్నవాళ్ళే ఎప్పటికైనా ఒకే తీరానికి చేరే అవకాశం వుంటుంది

**'జనశక్తి'** 5-4-2018 సంచికలో ప్రచురించిన 'చర్చ' - తిరిగి తిరిగి తలెత్తే ప్రశ్నలు - విస్తారమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని చర్చనీయాంశం చేస్తున్నది. బాలగోపాల్ రచన "నక్సలైటు ఉద్యమం వెలుగునీడలు"లోని కొన్ని ప్రత్యేక సంఘటనల నుండి సుధాకిరణ్ లేవనెత్తిన కొన్ని ప్రశ్నలలాగా అది కనిపిస్తున్నప్పటికీ, మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంత-రాజకీయ అవగాహన - ఆచరణలనే అది జవాబుదారీ చేస్తున్నట్లున్నది. బాలగోపాల్ ఏనాడో లేవనెత్తిన ప్రశ్నలకు యింకా కమ్యూనిస్టు ఉద్యమం సరైన జవాబు యివ్వక పోవటాన్ని సుధాకిరణ్ మళ్ళీ మళ్ళీ ప్రశ్నించటానికి పూనుకున్నట్లు, ఆ ప్రశ్నలున్నాయి.

తెలుగునాట హక్కుల ఉద్యమనేతగా, ప్రజాతంత్ర మేధావిగా విశేష ప్రాచుర్యం పొందిన బాలగోపాల్ చనిపోయి 9 సంవత్సరాలు గడిచిపోయినా, అతను 25 ఏళ్ళ క్రితం నుండీ, దాదాపు చనిపోయేవరకు (1993-2009) పీడిత ప్రజల రాజకీయ తాత్త్విక సిద్ధాంతమైన మార్క్సిజం పట్ల అనేక అనుమానాలతోకూడిన ప్రశ్నలను లేవనెత్తాడు. అలా ప్రశ్నించే క్రమంలో తన అభిప్రాయాలలో కూడా తీవ్రమైన మార్పులు సంభవించినప్పటికీ వాటిని వస్తుగత పరిస్థితులలో వచ్చిన మార్పులుగా పరిగణించి చర్చించాలని సుధాకిరణ్ కోరుతున్నాడు.

తన ప్రశ్నలకు గంభీరతను కలిగించటానికా అన్నట్లు తన వ్యాసం ప్రారంభంలోనూ, నడుమా, చివరనా కొన్ని కవితా పంక్తులను సుధాకిరణ్ ఉటంకించాడు. ఇంకా 1960వ దశకంనాటి కేరళ కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన ప్రశ్నల నుండి, 1975వ సంవత్సరంనాటి యూరోపు / లాటిన్ అమెరికా దేశాల కమ్యూనిస్టు ఉద్యమ సంఘటనల నుండి, శ్రీలంక ఎల్.టి.టి.ఇ.లో పనిచేసిన ఉద్యమకారిణి శివరమణి చేసుకున్న ఆత్మహత్యదాకా వివిధ సంఘటనలూ, సందర్భాలలో తలెత్తిన ప్రశ్నలను కూడా జతపరచి తను లేవనెత్తుతున్న చర్చకు లేక ప్రశ్నలకు ప్రత్యేక ప్రాముఖ్యతను కల్పించటానికి సుధాకిరణ్ ప్రయత్నించాడు.

కమ్యూనిస్టు విప్లవోద్యమంతో ఎల్‌టిటిఇ లాంటి బూర్జువా టెర్రరిస్టు ఉద్యమ ఘటనలను పోల్చడం ద్వారా సుధాకిరణ్ ఏమిచెప్పదలచుకున్నట్లు? లక్ష్యాలలో కమ్యూనిస్టులవి, ఎల్‌టిటిఇవి ఎలాగూ ఒకటికాదు; మార్గాలలో - అంటే టెర్రరిస్టు పంథాలో - తమిళ ఈలం, పీపుల్స్‌వార్ ఒకే విధానానికి చెందినవని సుధాకిరణ్ చెప్పదలచుకున్నాడా?

చెదిరిన గూడు గురించి, రాలి నలిగిపోయిన ఆకుల గురించి, రెక్కలు విరిగి నేలకూలిన పక్షుల గురించి, కూలిన వంతెనల గురించి ఎప్పటికైనా మాట్లాడుకోవాలంటూ, కమ్యూనిస్టు ఉద్యమ సుదీర్ఘ ప్రస్థానంలో పొందిన చేదు అనుభవాలను, తీపి జ్ఞాపకాలనూ (నష్టాలను, సానుకూల ఫలితాలను), కేవలం బాలగోపాల్ అనుభవాలకు పరిమితం చేసి ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు నాటికీ, నేటికీ సరైన జవాబు లభించలేదు కనుక, తిరిగి తిరిగి మళ్ళీ అవి మనముందు నిలుస్తాయంటూ సుధాకిరణ్ మరోసారి లేవనెత్తినవే ఈ ప్రశ్నలు.

భారత కమ్యూనిస్టు ఉద్యమానికి సుమారు నూరేళ్ళ చరిత్ర వుందని అనుకుంటే అది ప్రధానంగా మితవాద అవకాశవాదానికీ, అతివాద దుందుడుకు తనానికి బలయిందనే చేదువాస్తవం, ఎంతో కఠినమూ, బాధాకరమూ అయినప్పటికీ, ప్రస్తావించక తప్పటంలేదు. ఈ క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమంపై ఆశలు పెట్టుకున్న అశేష ప్రజానీకం, దాని విస్తరణ విజయాల కోసం చేయూతనందించిన కోట్లాది సానుభూతిపరులు, అందుకోసం తమ జీవితాలనే పణంగాపెట్టిన లక్షలాది కార్యకర్తలు, పాలకవర్గాల, రాజ్యహింసలకు ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించుకున్న వేలాది అమరవీరులు జ్ఞాపకాల్లోకి రావాలి. కష్టభరితమైన క్రూర నిర్బంధాల నడుమ ప్రజా ఉద్యమాలను నిర్మించిన కార్యకర్తల కృషి ఫలితాలను, వారి అనుభవాలను - గుణపాఠాలను బేరీజు వేసుకోవాలి. మితవాద - అతివాద పంథాల నడుమ ప్రజా ఉద్యమ కార్యాచరణ ద్వారా సరైన ప్రజా విప్లవపంథా అమలుజరగటమేకాక దానికోసం వివిధ చారిత్రక దశలలో ఆంతరంగిక - బహిరంగ చర్చలు కూడా జరిగాయని గమనంలో వుంచుకోవాలి.

కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ కాలాల్లో సరైన పంథా కోసం, విధానాల కోసం ఆంతరంగికంగా సాగిన సంఘర్షణ (1948-51) కానీ, 1960వ దశకంలో రివిజనిజం నుండి (1964లో), నయా రివిజనిజం నుండి (1967-68లలో) జరిగిన సంఘర్షణ కానీ బాలగోపాల్ పరిగణనలో ఉన్నట్లే కన్పించదు. అలాగే చారుమజుందార్ అతివాద పంథాకు వ్యతిరేకంగా తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు సాగించిన సిద్ధాంత, రాజకీయ ఘర్షణ కుండిన ప్రాముఖ్యతను బాలగోపాల్ పట్టించుకున్నట్లే లేదు.

1981లో సుమారుగా 30 ఏళ్ళ వయసులో బాలగోపాల్ పీపుల్స్ వార్ రాజకీయాల ప్రభావంలోకి వెళ్ళి అత్యంత వేగంగా 'బాల'మేధావిగా (ప్రాడిజీ) గుర్తింపు పొంది హక్కుల ఉద్యమ కార్యకర్తగా, నాయకునిగా, చరిత్ర, సాహిత్యం, ప్రజాఉద్యమాలు, మార్క్సిజం వ్యాఖ్యాతగా ప్రాచుర్యం పొందాడు.

బాలగోపాల్ దృష్టిలో విప్లవోద్యమమంటే, కమ్యూనిస్టుపార్టీ అంటే - సి.పి.ఐ(యం-ఎల్) పీపుల్స్‌వార్ మాత్రమే. అతనికి పరిచయమయేనాటికి పీపుల్స్‌వార్ 'గ్రామాలకు తరలివెళ్ళండి' కార్యక్రమాన్ని అమలు జరుపుతూ ఫ్యూడల్ దోపిడీ పీడనలకు గురవుతున్న కరీంనగర్ జిల్లా గ్రామాలలో పెద్ద కదలికను, సంచలనాన్ని కలిగిస్తూ వుంది. వ్యవసాయక విప్లవానికై విద్యార్థి

యువజనులు గ్రామాలలో ప్రజలనడుమ కృషి సల్పుతూ వున్నారు. ఉద్యమంపై నిర్బంధం పెరిగే కొద్దీ తిరిగి వ్యక్తిగత హింసావాద పద్ధతులలోకి ప్రవేశించారు.

'తిరిగి' అని ఎందుకన్నానంటే..... గతంలో '1968–1970'లలో శ్రీకాకుళం ఉద్యమాన్ని, చారుమజుందార్ మార్గదర్శకత్వంలో వ్యక్తిగత హింసావాదం వైపుకు నడిపించి, తీవ్రమైన నష్టాలకు గురయిన చేదు అనుభవం వుండినా కొత్తరూపాల్లో మళ్ళీ అదే అతివాదాన్ని కొన్ని రూపాల్లో అమలు పరిచారు. నాకు తెలిసి బాలగోపాల్ శ్రీకాకుళ ఉద్యమ అనుభవాలను ఎక్కడా సమీక్షించినట్టుకానీ, ప్రస్తావించినట్టుగానీ లేదు. బాలగోపాల్ దృష్టిలో పీపుల్స్‌వార్, మావోయిస్టులే కమ్యూనిస్టులు. వారి ఉద్యమమే మార్క్సిజానికి భారతదేశపు అన్వయము.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో విలువైన అనుభవాలను, గుణపాఠాలను అందించిన వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని బాలగోపాల్ సీరియస్‌గా అధ్యయనం చేసినట్లే కనబడదు. తను మార్క్సిజం ప్రభావంలోకి వచ్చిన కొద్దినాళ్ళకే తూర్పుగోదావరిజిల్లా కొండమొదలు ప్రాంతంలో గిరిజనులు తమ సాంప్రదాయక ఆయుధాలతో పోలీసులను ప్రతిఘటించి, భూస్వాములనొక్కరిని కూడా చంపకుండానే, అక్కడ భూస్వాములు లేకుండా చేయగలిగిన విప్లవోద్యమం – అదీ నిలకడగా ప్రజా పునాదిని దీర్ఘకాలం కాపాడుకుంటూ రాగలిగిన – రాజకీయ పంథా గురించి బాలగోపాల్ ఎప్పుడూ పట్టించుకున్నట్లే లేదు.

ఎందుకివన్నీ చెప్పదలుచుకున్నానంటే – బాలగోపాల్ అతివాద రాజకీయాలతో పెనవేసుకు సంచరించి, అదే విప్లవం, అదే మార్క్సిజం యొక్క ఆచరణ అని భావిస్తూ – ఆ అతివాదపు చేదునంతా విప్లవ లక్షణంగా, మార్క్సిజంలో లోపాలుగా పరిగణించాడు. విలువైన గత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అనుభవాలుగానీ, మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాదానికీ – అతివాదానికీ వ్యతిరేకంగా జరిగిన సిద్ధాంత రాజకీయ సంఘర్షణగానీ బాలగోపాల్ లాంటి మేధావి తెలుసుకునే సీరియస్ ప్రయత్నం చేసినట్లే కనబడదు. నక్సల్‌బరీకి ముందు కాలమంతా రివిజనిస్టు కాలమని నేర్చుకున్న పాఠాలను అధిగమించి – వివిధ దశలలో భారత కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన సిద్ధాంత – రాజకీయ – ఉద్యమ– నిర్మాణ పద్ధతుల కొరకు జరిగిన సంఘర్షణను ఆయన పట్టించుకోలేదు. ఆవిధంగా ఎందరో ఇతర కార్యకర్తల అనుభవాలను – గుణపాఠాలను ఆయన స్వీకరించలేకపోయాడు. తన స్వీయ అనుభవాలే సర్వస్వంగా భావిస్తూ – కనీసం అది అతివాదమని కూడా చెప్పకుండా – అదే మార్క్సిజం అదే విప్లవం అదే పార్టీ అనుకుంటూ మొత్తంగా మార్క్సిజాన్నీ ప్రజా విప్లవపంథాను తిరస్కరించే వైఖరి తీసుకున్నాడు. అయినా బాలగోపాల్ లాంటి మేధావికి అతివాదాన్ని అర్థం చేసుకోవటానికి 10 – 15 సంIIలు పట్టటమేమిటి? కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్ – ఏంగెల్స్‌లు అతివాదానికి గురయి చరిత్రను వ్యాఖ్యానించారని విమర్శించిన బాలగోపాల్ (మనిషి – మార్క్సిజం పేజీ 98–118) చారుమజుందార్ పంథాను అతివాదంగా భావించకపోవటం దేన్ని సూచిస్తుంది? అతివాదమే విప్లవపంథాగా భావించి, అది సాగించిన కొన్ని వికృత – అమానుష చర్యలు (సుధాకిరణ్ ఉదహరించినట్లు) చూచి విప్లవమే తప్పు అనీ, సంస్కరణవాదమే సామాజిక పురోగతికి గత్యంతరమనే నిర్ణయానికి బాలగోపాల్ వచ్చాడు. దీన్ని అనుభవవాదం తప్ప మరేమనాలి? ఈ సంస్కరణవాదం – అతివాదం కవల పిల్లలని లెనిన్ చెప్పిన మాట బాలగోపాల్ విషయంలో రుజువయినట్లు కాదా!

25 ఏళ్ళ క్రితమే విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజాన్ని వీడి వెళ్ళిపోవాలని బాలగోపాల్ నిర్ణయించుకున్న తర్వాత, ఇప్పుడు మనం అర్థం చేసుకోవడానికి కృషిసల్పాల్సింది, ఉద్యమాన్ని సరైన మార్గంలో నడిపించటానికి అవసరమైన సిద్ధాంత, రాజకీయ చర్చను గానీ, బాలగోపాల్‌ను అర్థం చేసుకునేదెట్లా – అని కాదు. బాలగోపాల్ చేసిన అనుభవవాద విమర్శను ఉద్యమాన్ని సరిదిద్దు కోవటానికి వినియోగపడే పరిమితి మేరకు అర్థం చేసుకోవచ్చు. బాలగోపాల్ విమర్శనే కేంద్రంగా చేసుకొని విప్లవోద్యమాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నించకూడదు.

సుధాకిరణ్ తన వ్యాసంలో ఉల్లేఖించిన మార్క్స్ వాక్యాల ప్రకారం పోరాటాలు విఫలమైపోతే, తిరిగి మూలాలకు వెళ్ళి కృషి సాగించాలని బోధించాడు. ఆ పోరాటాల అనుభవాలను చారిత్రక, భౌతిక దృక్పథంతో సమీక్షించుకొని గుణపాఠాలను స్వీకరించి తదనంతర ఉద్యమ నిర్మాణాలకు అన్వయించుకోవాలి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన విచ్ఛిన్నాలకు, పెడమార్గాలకు కారణమైన అతివాద, మితవాద సిద్ధాంత – ఆచరణలను అన్నిరకాల కమ్యూనిస్టు శ్రేణులు నిజాయితీగా తమలో తాము, సమిష్టిగానూ సమీక్షించుకుంటే తప్ప భారత పీడిత ప్రజలకు సరైన విప్లవ మార్గం అందించలేరు. అందుకు సుధాకిరణ్‌తోసహా మేధావులందరూ సహకరిస్తే వారి కృషి ఫలవంతమూ, అభినందనీయమూ అవుతుంది.

**– జి. ఆనందగోపాల్**

ooooo